సాక్షి
నారాయణపేట

శుక్రవారం ׀ 9 ׀ ఆగస్టు ׀ 2024



విద్యార్థులకు అస్వస్థత
అల్పాహారం తిని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

వివరాలు 8లో ▸



నిర్లక్ష్యం వీడండి
జోగులాంబ క్షేత్రంలో అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వీడాలని కలెక్టర్ సంతోష్ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.8 /23.3

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం, చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కందుకూరులో తేళ్ల పంచమి

నారాయణపేట: జిల్లా సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రంలోని కందుకూరులో శుక్రవారం తేళ్ల పంచమి వేడుకలు జరుపుకోనున్నారు. దేశమంతా నాగుల పంచమి నిర్వహించుకుంటే.. ఇక్కడ మాత్రం తేళ్ల పంచమి నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా గుర్మిట్కల్ నియోజకవర్గం కందుకూరు గ్రామ సమీపంలోని కొండమవ్వ అమ్మవారి సన్నిధిలో తేళ్ల పంచమిగా భక్తులు కొండమవ్వను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. కొండపై ఆలయ పరిసరాల్లో ఏ చిన్న రాయిని తొలగించినా తేళ్లు కనిపిస్తాయి. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరు ఎంతో ఉత్సాహంగా తేళ్లను పట్టుకుంటారు. వీటిని చేతితో తాకినా.. పట్టుకున్నా.. శరీరంపై పాకించిన కుట్టవు. ప్రతి ఏటా నాగుల పంచమి రోజే తేళ్ల పంచమి జరుపుకోవడం ఇక్కడ ప్రత్యేకత.

పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

నారాయణపేట: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కలెక్టర్ సిక్తా పటా్నయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఎస్పీ ఆఫీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నామని అందుకనుగుణంగా వేదిక, బ్యారికేడింగ్, సీటింగ్ ఏర్పాట్లతో పాటు లోపల, వెలుపలికి వెళ్లే దారిని లెవెలింగ్ చేయించాలన్నారు. పట్టణమంతా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, రంగు రంగులపూలతో వేదికను అందంగా అలంకరించాలని, ప్రోటోకాల్ ప్రకారం అతిథులను ఆహ్వానించాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, ట్రైని కలెక్టర్ గారిమా నరుల, ఎస్పీ యోగేష్‌గౌతమ్, రెవెన్యూ కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో మధుమోహన్ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దాలి



నారాయణపేట: పాఠశాల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారి కృషితోనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి,జాతీయ స్థాయిలో క్రీడలలో రాణిస్తున్నారని ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల అన్నారు. గురువారం స్థానిక గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో డీఈఓ అబ్దుల్ ఘని అధ్యక్షతన నిర్వహించిన జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా నుంచి 14మంది విద్యార్థులు రాష్ట్ర స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికయ్యారని, ఇందులో వ్యాయమ ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. వ్యాయమ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని, అలాగే మండల జిల్లా స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు కొంత బడ్జెట్ కేటాయించే విధంగా కృషి చేస్తామన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సిములు గతేడాది జిల్లాలో క్రీడల నిర్వహణను వివరించారు. అనంతరం ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు డీఈఓ సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ విద్యాసాగర్ ఎస్ఓ శ్రీనివాస్, డీవైఎస్ఓ వెంకటేష్, హెచ్ఎం వేణుగోపాల్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో వైజ్ఞానిక పరిజ్ఞానం పెంచాలి



మరికల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో వైజ్ఞానిక పరిజ్ఞానం పెంచేలా పాఠ్యాంశాలు బోధించాలని జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్ అన్నారు. మరికల్ మండలం కన్మనూర్ ఉన్నత పాఠశాల్లో గురువారం భౌతిక, జీవ శాస్త్రాల ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి, శాస్త్రీయ దృక్పథం , ప్రయోగ నైపుణ్యాలు పెంపొందించాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాలను నిర్వహించి అవార్డులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో అంజయ్య, అనురాధ, రమేష్, శివకుమార్, మహేశ్వరి, విజయ్ కుమార్, నిహారికలు పాల్గొన్నారు.



కోయిల్‌సాగర్ నుంచి విడుదలవుతున్న నీరు

ఎత్తిపోతలపై బకాయిల భారం

కోయిల్‌సాగర్‌ది అదే పరిస్థితి..

మరికల్, ధన్వాడ, చిన్నచింతకుంట, దేవరకద్ర మండలాల పరిధిలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించారు. అయితే ఈ ప్రాజెక్టుకు ఆది నుంచి సమస్యలే ఎదురవుతున్నాయి. తాజాగా జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వస్తున్న సమయంలో నీటిని ఎత్తిపోయాల్సిన పంపుహౌస్‌లోని మోటార్లలో సాంకేతిక సమస్య తలెత్తడంతో దాదాపు 20 రోజుల పాటు నిలిచిపోయింది. ఎట్టకేలకు మోటారులో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరించిన అధికారులు ఐదురోజుల కింద నీటి పంపింగ్ మొదలుపెట్టారు.

సాగునీటి ప్రాజెక్టుల్లో తరచుగా మోటార్ల రిపేర్లు

- ఇప్పటికే కల్వకుర్తి, కోయిల్‌సాగర్.. తాజాగా నెట్టెంపాడులో సాంకేతిక సమస్య
- గుడ్డెందొడ్డి మొదటి లిఫ్టునకు నిలిచిన నీటి పంపింగ్
- బకాయిలు చెల్లించకపోవడంతో నిర్వహణ వదిలేసిన కాంట్రాక్టు కంపెనీ
- వరద సమయంలో నిలిచిపోతుండటంతో సాగునీటిపై ప్రభావం

గద్వాల రూరల్: ఉమ్మడి పాలమూరులో బీడు భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి జలయజ్ఞంలో భాగంగా పెద్దఎత్తున సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను నిర్మాణం చేపట్టి వాటి కింద సుమారు 6 లక్షల ఎకరాలకు పైగా సాగునీటిని అందిస్తున్నారు. అయితే తాజాగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎత్తిపోతలకు గ్రహణం పట్టుకుంది. సాగునీటిని ఎత్తిపోసే పంపులకు సంబంధించి మోటార్లకు కొన్నేళ్లుగా సరైన మరమ్మతు చేయకపోవడంతో తరచుగా మొరాయిస్తున్నాయి. ఇప్పటికే కల్వకుర్తి, కోయిల్‌సాగర్‌లో మోటార్లు మరమ్మతుకు గురవగా.. తాజాగా నెట్టెంపాడు మోటార్లకు సైతం సాంకేతిక సమస్య తలెత్తింది. వీటి నిర్వహణకు సంబంధించి కాంట్రాక్టు కంపెనీకి బకాయిలు పేరుకుపోవడంతో ఈ దుస్థితికి కారణమైంది. ప్రస్తుతం కృష్ణానదికి వరద వస్తున్న ఈ సమయంలో మోటార్లు మరమ్మతుకు గురవడం ఎత్తిపోతల ప్రాజెక్టులకు శాపంగా మారింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎత్తిపోతల కింద ఉన్న లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం ప్రశ్నార్థకంగా మారుతుంది.

కల్వకుర్తిలో రెండే పంపులు

నాగర్‌కర్నూల్ జిల్లాలో 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. అయితే ఇప్పటికే ఆ ప్రాజెక్టు కింద 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఇందుకోసం మొత్తం 5 పంపులు ఏర్పాటు చేయగా.. వివిధ కారణాలతో ప్రస్తుతం రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన మూడు పంపులు మూడేళ్లుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. కేవలం రెండు పంపుల ద్వారానే నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి నెలకొంది.



కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదటి లిఫ్టు వద్ద మరమ్మతుకు గురైన మోటార్లు

ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వీడాలి..



గుడ్డెందొడ్డి లిఫ్టులో నీటిని పంపింగ్ చేసే మోటార్లలో సాంకేతిక సమస్య తలెత్తి పంపింగ్ ఆగిన విషయమై సంబంధిత అధికారులను అడిగితే మెయింటెనెన్స్ చేయాల్సిన బీహెచ్‌ఈఎల్ కంపెనీ వారికి చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంతో చేతులెత్తేశారని, ప్రభుత్వం నుంచి రూ.కోటికిపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇదే విషయాన్ని ఇరిగేషన్ మంత్రి, ఆ శాఖ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తే వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. వారికి నేనే 50 సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే బకాయిలు చెల్లించాలి.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

శాశ్వత పరిష్కారం కాలేదు..

గుడ్డెందొడ్డి పంపుహౌజ్‌లో నాలుగు మోటార్లు ఉండగా.. రెగ్యులర్‌గా రెండు పంపులను రన్ చేస్తూ నీటిని పంపింగ్ చేస్తాం. ప్రస్తుతం మోటార్లలో సాంకేతిక సమస్య తలెత్తడంతో నీటి పంపింగ్ ఆగింది. వీటిని మెయింటెన్ చేసే బీహెచ్‌ఈఎల్ కంపెనీ సమస్య పరిష్కరించాలి. కానీ వారికి రూ.1.13 కోట్లు చెల్లించాల్సి ఉండడంతో వారు రావడం లేదు. దీంతో మేమే ఇంజినీర్లతో కలిసి మోటారులో తలెత్తిన సమస్యను పరిష్కరించి నీటి పంపింగ్ మొదలుపెట్టాం. సమస్యకు శాశ్వత పరిష్కారం కాలేదు.

– రహీముద్దీన్, ఈఈ, నెట్టెంపాడు

నెట్టెంపాడులో ఏ క్షణమైనా..

గద్వాల జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం 90 శాతం పనులు పూర్తయ్యి నిధుల లేమితో పదేళ్లుగా అసంపూర్తిగానే ఉంది. దీని పరిధిలోని గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు జలాశయాల కింద 1.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ఇక్కడ కూడా మొదటి పంపుహౌస్ అయిన గుడ్డెందొడ్డి లిఫ్టులో నీటిని పంపింగ్ చేసే మోటార్లలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రెండు రోజుల పాటు ఆగింది. ఈ మోటార్ల మెయింటెనెన్స్ బీహెచ్‌ఈఎల్ నిర్వహిస్తుండగా వీటికి సంబంధించి ప్రభుత్వం రూ.1.13 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ విషయమై గతంలోనే ప్రభుత్వానికి విన్నవించినా డబ్బులు చెల్లించకపోవడంతో వారు మెయింటెనెన్స్‌ను నిలిపివేశారు. దీంతో సీఈ రఘునాథరావు, ఇంజినీర్ల బృందం గుడ్డెందొడ్డి లిఫ్టు మోటార్లలో తలెత్తిన సాంకేతిక సమస్యను బీహెచ్‌ఈఎల్ వారిని ఫోన్ ద్వారా సంప్రదించి పరిష్కరించారు. అయితే ఈ మోటార్లు ఏ క్షణానైన ఆగిపోవచ్చని.. అప్పుడు పరిస్థితి మరింత క్లిష్టంగా మారవచ్చని ఇంజినీరింగ్ అధికారులే చెబుతున్నారు.



నెట్టెంపాడు ఎత్తిపోతల గుడ్డెందొడ్డి మొదటి లిఫ్టులో మరమ్మతుకు గురైన మోటార్లు

పెచ్చులూడిన తహసీల్దార్ కార్యాలయ పైకప్పు

- రైతు, కార్యాలయ సిబ్బందికి గాయాలు



తహసీల్దార్ కార్యాలయం గేట్ వద్ద ఊడిపడిన పెచ్చులు

ఊట్కూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ పైకప్పు సిమెంట్ పెచ్చులు ఊడి కిందపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. 15 ఏళ్ల క్రితం కోటవీధి ప్రాంతంలో ఈ భవనాన్ని నిర్మించారు. గురువారం మధ్యాహ్నా పగిడిమారికి చెందిన రైతు మహ్మద్ హాజీ భూ సమస్యపై కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్తుండగా గేట్ దగ్గర పైకప్పు పెచ్చులు ఊడి తలపై పడ్డాయి. దీంతో తల పగిలి తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన నిడుగుర్తి వీఆర్‌ఏ వెంకటేశ్ ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తలరించారు. మరొకరు కార్యాలయ సిబ్బంది తలకు స్వల్ప గాయాలు అయ్యాయి. కార్యాలయంలోని రికార్డు గదిలో రెండేళ్లుగా పై కప్పు పెచ్చులు ఊడుతున్నా మరమ్మతు చేపట్టడం లేదని రైతులు తెలిపారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా...

భవనం పైకప్పు పెచ్చులు ఊడి పడడంతో రైతుతో పాటు కార్యాలయ సిబ్బందికి తలకు గాయాలు అయ్యాయి. రికార్డు గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఈ విషయాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ దృష్టికి తీసుకెళ్లి భవనం మరమ్మతులు చేయిస్తాం.

–కల్యాణి, తహసీల్దార్, ఊట్కూర్

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం



నారాయణపేట: దేశంలో బీఆర్ అంబేద్కర్ ఆశయం సజీవంగా ఉంటుందని, ప్రతి పౌరునికి సమాన హక్కులను కల్పించిన రాజ్యాంగాన్ని కాలరాసి తూట్లు పొడిచే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆ పార్టీ శాఖా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని అత్యున్నత రాజ్యాంగాన్ని బి.ఆర్ అంబేద్కర్ అందించాడని కొనియాడారు. కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తూట్లు పొడవాలని ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. ఎంతో కాలం నుంచి ఎన్నో వివక్షలు ఎదుర్కొని అత్యంత దారుణంగా బతికిన ఎస్సీ ఎస్టీ బీసీ ఆదివాసీల హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దళితులపై మహిళలపై ఆదివాసులపై దాడులు పెరిగాయని ఆయన విమర్శించారు. రెండు దఫాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వానికి సంపూర్ణ మెజార్టీని ఇచ్చిన దేశ ప్రజలు, 3.0కు మాత్రం సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు దేశ ప్రజలు తీర్పు చెప్పారని, ఈ తీర్పు తోనైనా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక దళిత ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి దేశ ప్రజలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా సమితి సభ్యులు పి వెంకటేష్ , సిపిఐ నాయకులు బాలయ్య మాసయ్య బాలకృష్ణ జంపన్న తదితరులు పాల్గొన్నారు.

యువత ఆరోగ్య నియమాలు పాటించాలి

నారాయణపేట రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సక్రమ మార్గంలో నడుచుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ అన్నారు. పట్టణంలోని సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం యూత్ ఫీస్ట్ - 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. నిత్యం ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మద్యం సేవించడం, దుమపానం తదితర అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంతకుముందు జెండా ఊపి రెడ్ మారథన్ రన్ ప్రారంభించగా పోటీలో 70మంది బాలురు, 30మంది బాలికలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణగౌడ్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎండీ రియాజ్ ఖాన్, డాక్టర్లు సాయిరామ్, శ్రీధర్, బిక్షపతి పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శైలజ

ముంపు బాధితులను ఆదుకుంటాం



భూత్పూర్‌లో నీటి ఊట వస్తున్న ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- ఆర్అండ్ఆర్ సెంటర్ల ఏర్పాటుకు కృషి
- పలు ముంపు గ్రామాల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పర్యటన

మక్తల్: ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని.. ఆర్అండ్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని.. ఇప్పటివరకే ఉన్న సెంటర్లలో వసతులు కల్పిస్తామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం మక్తల్ మండంలోని భూత్పూర్, గడ్డంపల్లి, అంకెన్‌పల్లి, అనుగోండ, దాదాన్‌పల్లి గ్రామాల్లో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సుడిగాలి పర్యటన చేశారు. అనంతరం భూత్పూర్ రిజర్వాయర్ కింద ఉన్న ఇళ్లల్లో ఊట ఉంటుందని, 15 ఏళ్లుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వివరించారు. నారాయణపేట –కొడంగల్ ఎత్తిపోతల పథకానికి భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకుపోవడం జరుగుతుందని, వీటికి త్వరల్లో టెండర్లు వేయడం జరుగుతుందని అన్నారు. దీంతో సమస్యలు మరింత పెరుగుతాయని, వెంటనే ఆర్అండ్ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. గ్రామంలో ఏ ఇంట్లో చూసినా గోడల్లో నీటి ఊట వస్తుందని, రాత్రి సమయంలో పాములు, మొసళ్లు, విషపురుగులతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారని తెలపగా.. కలెక్టర్ నేరుగా ఇళ్లలోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన వారు వినతి పత్రాలు అందజేశారు. అలాగే, జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కింద ఉన్న అంకెన్‌పల్లి, అనుగోండ, దాదాన్‌పల్లి గ్రామాల్లో నేటికీ ఆర్అండ్ఆర్ సెంటర్ ఏర్పాటు చేయలేదని, జీఓ నంబర్ 1050 నుంచి గ్రామాలను పునరావాస గ్రామాలుగా ప్రకటించడం జరిగిందని, వీలైనంత త్వరగా పునరావాస సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ముంపు గ్రామాల్లో ప్రతి ఒక్కరిని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, త్వరల్లో ముంపు గ్రామాలకు ఆర్ అండ్ఆర్ సెంటర్‌లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు.



ఆర్అండ్ఆర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు అందజేస్తున్న గ్రామస్తులు

మొక్కలు నాటిన కలెక్టర్, ఎమ్మెల్యే

భూత్పూర్ గ్రామంలో స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, మక్తల్ ఎమ్మెల్యే మొక్కలు నటారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే, మక్తల్ పెద్ద చెరువు సమీపంలో దుకాణ సముదాయం ఏర్పాటు చేసేందుకు వారు స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్‌కు ఆదాయం పెంచాలని, పట్టణ అభివృద్ధి ఇలాంటి పనులు చేస్తే బాగుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ అశోక్, ఆర్డీఓ మధుమోహన్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, ఎంపీడీఓ రమేష్, మాజీ ఎంపీపీ హన్మంతు, మాజీ ఎంపీటీసీ కుర్మయ్యగౌడ్, మాజీ సర్పంచులు రమేస్, లక్ష్మన్, ప్రతాప్‌రెడ్డి చెన్నయ్యగౌడ్, శివారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం



రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కోస్గి: మున్సిపల్ పరిధిలోని పట్టణ ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా శివాజీ చౌరస్తా నుంచి సయ్యద్ పహాడ్ దర్గా వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన వారందరికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించి ఆదుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విస్తరణలో ఆస్తులు కోల్పోయిన బాధితులు, కౌన్సిలర్లు, ఇతర నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బాధితుల డిమాండ్లను అడిగి నమోదు చేసుకున్నారు. రోడ్డు విస్తరణలో మొత్తం 140 మంది బాధితులు ఇళ్లు కోల్పోగా అందులో 16 మంది న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించడంతో కొంత మేర పనులు నిలిచిపోయాయి. ఈ మేరకు వారి డిమాండ్లు పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బాధితులకు మార్కెట్ విలువ మేరకు ధర చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలపగా మార్కెట్ విలువ గజం రూ.2100 మాత్రమే ఉందని, బయట మార్కెట్ విలువ ప్రకారం గజం రూ.15000 చెల్లించాలని కొందరు, రూ.11000 చెల్లించాలని, ఇంటి స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మరికొందరు డిమాండ్ చేశారు. బాధితుల డిమాండ్లను అధికారులు నమోదు చేసుకున్నారు. పూర్తి వివరాలు ప్రభుత్వానికి పంపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ శశిధర్, తహసీల్దార్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో 'డయల్ 100' సేవలు కీలకం



డయల్ 100 సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట: నేర నియంత్రణలో.. శాంతిభద్రతల పరిరక్షణలో బ్లూకోట్స్ సిబ్బంది సేవలు.. డయల్ 100 పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో డయల్ 100 సేవల నిర్వహణపై బ్లూ కోట్స్ సిబ్బందితో ఎస్పీ సమీక్షించారు. బ్లూ కోట్స్ వాహనాలను ప్రొజెక్టర్ ద్వారా అవి తిరిగే రూట్ మ్యాప్‌ను, సమయాన్ని చూపిస్తూ పలు సూచనలు చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు డయల్ 100 ద్వారా వచ్చిన కాల్స్‌కి బ్లూ కోట్స్ సిబ్బంది వీలైనంత త్వరగా స్పందించి సంఘటన స్థలాన్ని చేరుకోవడం ద్వారా నేర తీవ్రతను వీలైనంత వరకు తగ్గించవచ్చన్నారు. ఘటన స్థలంలో సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి స్టేషన్ సిబ్బంది సేవలు వినియోగించుకోవాలని సూచించారు. డయల్ 100కు వినియోగించే ట్యాబ్‌లను జాగ్రత్తగా 24 గంటలు నెట్‌వర్క్‌లో ఉండేలా చూడాలని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు.

రాత్రి వేళల్లో అప్రమత్తత అవసరం..

రాత్రి సమయాల్లో పట్టణ ప్రాంతాల్లో గస్తీలు నిర్వహిస్తూ ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని, కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మొబైల్, ట్యాబ్, లేదా సెట్ ద్వారా కమ్యూనికేషన్ సమాచారాన్ని సంబంధిత సిబ్బందికి చేరవేసి ప్రజల వద్దకు త్వరగా చేరుకునే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. సిబ్బందికి ఉద్యోగపరంగా ఎటువంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలియజేశారు. అనంతరం బ్లూ కోట్స్ సిబ్బంది వాహనాలను పరిశీలించి ఎలాంటి మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించాలని, కండిషన్‌లో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎన్ లింగయ్య, డయల్ 100 సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మల్దకల్: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని అమరవాయిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రామకృష్ణ తన వ్యవసాయ పొలంలో పంటను సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంట్లో తరచూ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది గురువారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బక్కలింగాయపల్లికి చెందిన బోడ్కనాయక్(42), రవి గ్రామం నుంచి బండతాండకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి గురువారం సాయంత్రం స్వగ్రామానికి వస్తుండగా మూలమలుపు వద్ద అచ్చంపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (అచ్చంపేట ఆర్టీసీ డిపో) ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ద్విచక్రవాహనంపై ఉన్న బోడ్కనాయక్, రవికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బోడ్కనాయక్ మృతి చెందాడు. రవి చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రేమించి మోసం చేసిన యువకుడికి జైలు శిక్ష

కొత్తకోట రూరల్: యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాలెంకు చెందిన చింతకాయల లక్ష్మీనారాయణ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని యువతి పోలీస్‌స్టేషన్‌లో 2018లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ రవికాంత్‌రావు, సీఐ సోమ్‌నారాయణసింగ్ కేసు నమోదు చేశారు. ప్రస్తుత వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ఫైనల్ చార్జిషీట్ వేయడంతో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్స్ తిరుపతయ్య, శ్రీనివాసులుతో కలిసి పీపీ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రిన్సిపాల్ జడ్జి సునీత పూర్వపరాలు పరిశీలించి నిందితుడికి 10ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు.

పూడ్చిన మృతదేహానికి పంచనామా



మద్దూరు: మండలంలోని నందిపాడ్‌లో దిడ్డి కవితమ్మ అలియాస్ రాములమ్మ మృతిపై అనుమానాలున్నాయని మృతురాలి అన్న నర్సింహ ఫిర్యాదు మేరకు గురువారం తహసీల్దార్ మహేష్‌గౌడ్ సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి శవపంచనామా నిర్వహించిన ఘటన మండలంలోని నందిపాడ్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నందిపాడ్‌కు చెందిన కవితమ్మ జూలై 11న మృతిచెందింది. కుటుంబ సభ్యుల సమక్షంలో మరుసటి రోజు పూడ్చివేశారు. అయితే తన చెల్లెలి మృతిపై అనుమానాలు ఉన్నాయని వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలంలోని చిల్‌ముల్ మైలారానికి చెందిన నర్సింహ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మద్దూరు తహసీల్దార్ మహేష్‌గౌడ్ సమక్షంలో మహబూబ్‌నగర్ నుంచి ఫోరెన్సిక్ నిపుణుల ద్వారా శవపరీక్ష చేసి మృతదేహాన్ని తిరిగి పూడ్చి వేసినట్లు తెలియజేశారు. ఈ మృతిపై ఫోరెన్సిక్ రిపోర్టు ఆధారంగా మృతురాలి మరణానికి పూర్తి కారణాలు తెలుస్తాయని ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

నారాయణపేట రూరల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్కూర్ మండలం ఎర్గట్‌పల్లికి చెందిన సుజాత మూడు రోజుల కిందట పాముకాటుకు గురైంది. అదే రోజు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందింది. తిరిగి గురువారం మరోసారి పరీక్షలు చేయించుకునేందుకు సొంత గ్రామం నుంచి బంధువైన అభిషేక్(18)తో కలిసి ద్విచక్రవాహనంపై నారాయణపేటకు వస్తుంది. ఈ క్రమంలో సింగారం గేట్ సమీపంలోని దత్త బృందావన్ కళాశాల వద్ద ఎద్దులను తప్పించబోయి ప్రమాదవశాత్తు బైక్ కింద పడింది. అభిషేక్ తల రోడ్డుకు బలంగా తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సుజాతకు గాయాలు కావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అభివృద్ధిపై నిర్లక్ష్యం వీడండి



అధికారులతో కలిసి ప్రసాద్ స్కీం భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎస్ సంతోష్

ప్రసాద్ స్కీం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ బీఎస్ సంతోష్
- అలంపూర్ క్షేత్రం పరిశీలన
- ఆలయ ప్రాంగణంలో అపరిశుభ్రత, అసౌకర్యాలపై అసంతృప్తి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచన

జోగుళాంబ శక్తిపీఠం/అలంపూర్ రూరల్: రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి పనుల పూర్తిపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడాలని కలెక్టర్ బీఎస్ సంతోష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున రూ. 38.50 కోట్లతో నిర్మిస్తున్న ప్రసాద్ స్కీం భవనాన్ని గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ, కేంద్ర పురావస్తు శాఖ, ఇరిగేషన్, పురపాలిక, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం దేవస్థానంలోని ఆలయాలు, భవనాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రసాద్ స్కీం భవన నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. నిర్మాణ పనులు ఎప్పటిలోగా పూర్తిచేస్తారని ప్రాజెక్టు హెడ్ అనంతరావు, ఏఈ కల్యాణరెడ్డిలను కలెక్టర్ ప్రశ్నించగా.. ఇప్పటి వరకు రూ. 23 కోట్ల బిల్లులు మంజూరయ్యాయని, మిగతా బిల్లులు ఆగిపోవడంతో పనులలో జాప్యం చోటు చేసుకుంటుందని చెప్పారు. ఇప్పటి వరకు రూ. 30 కోట్ల పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. కాగా, ఇప్పటికే అభివృద్ధి పనులు ఆలస్యమయ్యాయని.. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

భోజనశాలను స్వాధీనం చేసుకోండి..

నిర్మాణం పూర్తయిన భోజనశాల భవనాన్ని తక్షణమే దేవస్థానం ఆధీనంలోకి తీసుకోవాలని ఆలయ ఈఓ పురేందర్ కుమార్‌ను కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. ఈ విషయమై ఈఓ మాట్లాడుతూ.. ఇక్కడ నీటి లభ్యత లేదని, భోజనశాల నిర్వహణకు తగిన సిబ్బంది కావాలన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 26వ తేదీలోగా భోజన శాలను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా ప్రసాద్ స్కీం భవనానికి రోజు 10 వేల నుంచి 20 వేల లీటర్ల నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించగా.. పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. అయితే ప్రసాద్ స్కీం నిధుల నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేయిస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

అపరిశుభ్రతపై ఆగ్రహం..

దేవస్థానం ఎదుట పుష్కరఘాట్ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటం.. కుక్కలు, మేకలు సంచరించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. భక్తులు స్నానంచేసిన తర్వాత దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మించడంతో పాటు బోటింగ్ సౌకర్యం కల్పించాలని పర్యాటకశాఖ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణంలో లైటింగ్‌తో పాటు సూచిక బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ పార్కింగ్ స్థలానికి ప్రహరీ నిర్మించాలని సూచించారు. పురావస్తు ప్రదర్శన శాలను భక్తులు గుర్తించేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలోని అన్నదాన సత్రం, ప్రసాద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. శతాబ్దాల చరిత్ర కలిగిన క్షేత్రంలో నిర్మించిన కొన్ని కట్టడాలతో ఆలయ సమగ్రరూపం దెబ్బతింటుందని.. అవన్నీ తొలగించాలని కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ రోహిణి, ఏఈ నవీన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆలయ ప్రాకార మండపంలో ఉన్న వాహనాలు తీసివేయాలని.. ఈఓ, చైర్మన్ కార్యాలయాలను బయటికి మార్చాలన్నారు. దేవస్థానంలోకి ఎవరి వాహనాలను అనుమతించవద్దని అన్నారు. వాహనాల పార్కింగ్ బాధ్యత పురపాలిక తీసుకోవాలని చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ సరస్వతిలకు సూచించారు. నవబ్రహ్మ ఆలయాలను భక్త యాత్రికులు దర్శించుకునేలా రూట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల పాల్గొన్నారు.



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

జూరాల వద్ద 45 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గడం లేదు. ఇన్‌ఫ్లో గురువారం మరింత పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 2.70లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గురువారం సాయంత్రానికి 3.15లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 45 క్రస్టు గేట్లను ఎత్తి 3,13,065 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 67, నెట్టెంపాడుకు 750, కుడి కాల్వ ద్వారా 697, ఎడమ కాల్వకు 820, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 100, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,35,488 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.591 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,77,959 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 100.933 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 25 గేట్లను ఎత్తి 2,00,490 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 27.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

87 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు 87.5 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. గురువారం ఎగువలోని కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం 19,774 క్యూసెక్కులను వినియోగించి దిగువ శ్రీశైలంకు నీటిని వదులుతున్నామని చెప్పారు.

సుంకేసులకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో



సుంకేసుల నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో గురువారం స్వల్పంగా పెరిగింది. బుధవారం 10 గేట్ల ద్వారా నీటి విడుదల చేయగా, గురువారం 12 గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం ఎగువ నుంచి 56,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 12 గేట్ల ద్వారా 53,748 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

ఆర్టీసీ లక్కీ డ్రాను సద్వినియోగం చేసుకోండి



లక్కీ డ్రా నిర్వహిస్తున్న ఆర్‌ఎం వి.శ్రీదేవి, అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో లక్కీడ్రా సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం మహబూబ్‌నగర్ డిపోకు సంబంధించిన సూపర్ లగ్జరీ నెలవారీ లక్కీడ్రా, అదేవిధంగా రీజియన్‌లోని 10 డిపోలకు చెందిన 15 రోజుల డీలక్స్ బస్సుల లక్కీడ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణం చేసి బాక్స్‌ల్లో వేసిన టికెట్లను ప్రయాణికులతో లక్కీ డ్రా తీయించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు ప్రయాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ లక్ష్మీధర్మ, పీఓ శ్రీనివాస్‌రెడ్డి, డిపో మేనేజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

➪ మహబూబ్‌నగర్ డిపోకు సంబంధించి సూపర్ లగ్జరీ బస్సుల డ్రాలో డి.భాగ్యలక్ష్మి, వీఎస్ చారి, అబ్దుల్ సత్తార్, రీజియన్‌లో డీలక్స్ బస్సుల డ్రాలో చంద్రకళ, జి.సరస్వతి, లక్ష్మి గెలుపొందారు.

ఏడేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఘటన



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో ఏడేళ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ గురువారం విచారణ చేపట్టి, వివరాలు వెల్లడించారు. కొల్లాపూర్‌లోని ఐఓసీ పెట్రోల్ బంక్ సమీపంలో చిన్న గుడారం వేసుకొని ఓ కుటుంబం జీవనం సాగిస్తోంది. సమీపంలోనే ఉన్న ఓ ట్రాక్టర్ షోరూంలో భర్త, అక్కడే ఉన్న హోటల్‌లో భార్య పని చేస్తున్నారు. వారి కూతురు (7) సమీపంలోని పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. గద్వాల జిల్లా మానవపాడుకు చెందిన గొల్ల నరసింహ(45) రెండేళ్ల క్రితం కొల్లాపూర్‌కు వచ్చి ఇక్కడే మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పోలీసుస్టేషన్ సమీపంలోనే అతను నివాసం ఉంటున్నాడు. నరసింహ మేకలు మేపుకుంటూ రోజూ ట్రాక్టర్ షోరూం వైపు వచ్చేవాడు. ఈక్రమంలో బాధితురాలి కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇంటివద్ద పాప ఒంటరిగా ఉండడాన్ని గమనించాడు. అమ్మాయిని బలవంతంగా గుడారంలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ చిన్నారి ఏడుస్తూ వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్టు చేశారు. అతనిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ మహేష్, ఎస్‌ఐ హృషికేష్ ఉన్నారు.

ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు మిడ్జిల్ విద్యార్థిని ఎంపిక



శైలజ

మిడ్జిల్: ఢిల్లీలో నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు మిడ్జిల్ మండలం నుంచి ఓ విద్యార్థినికి ఆహ్వానం అందింది. ప్రధాన మంత్రి చేతుల మీదుగా జరిగే త్రివర్ణపతాక ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుంచి 14 మంది విద్యార్థులను ఎంపిక చేయగా.. మిడ్జిల్ మండలానికి సైతం ఒక అవకాశం దక్కింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని వల్లబరావుపల్లికి చెందిన జంగం నిరంజన్, జంగం లక్ష్మమ్మల కుమార్తె శైలజ, డీఆర్ బీఆర్‌ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. కాగా.. ఈ విద్యార్థిని ఎన్‌ఎస్‌ఎస్‌తో పాటు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనటంతో ఆమె ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఎంపికైనట్లు తెలుస్తోంది. దీంతో ఆ విద్యార్థినిని మండల అధికారులు, నాయకులు అభినందించారు.

ఆర్థిక క్రమశిక్షణ అవసరం

- పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి
- విద్యార్థులకు జాతీయ వెబినార్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం పీయూలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సంపాదనలో కొంత డబ్బును మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టాలని సూచించారు. ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లో పొదుపు చేయాలని, నిర్దిష్ట కాలపరిమితి తర్వాత రిటర్న్స్ అధిక మొత్తంలో వస్తాయన్నారు. కొద్దికొద్దిగా డబ్బులు పొదుపు చేసి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలన్నారు. సెబీ మాజీ డీజీఎం సూర్యకాంత్ శర్మ మాట్లాడుతూ సరైన కంపెనీలో సరైన సమయంలో పెట్టుబడి పెడితే సరిపోతుందన్నారు. ఆర్థిక అక్షరాస్యత సాధించి, పెట్టుబడి నిర్ణయాన్ని కెరీర్ ప్రారంభం నుంచే చేపట్టాలన్నారు. రైతులు కిసాన్‌పత్ర, జాతీయ పొదుపులు, పోస్టాఫీసు పథకాలు, మ్యూచువల్ ఫండ్స్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీయూలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.చంద్ర కిరణ్, ఆచార్యులు, అధ్యాపకులు డా.అర్జున్‌కుమార్, డా.కె.నాగసుధ, జావీద్, డా.ఎం.అరుంధతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- అల్పాహారం తిన్న 34 మందికి వాంతులు
- బాధితులకు అచ్చంపేట ఆస్పత్రిలో చికిత్స
- పాఠశాల, ఆస్పత్రిలో పరిశీలించిన డీఈఓ, డీఎంహెచ్ఓ, డీఎస్పీ



అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 34 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. లింగోటం సమీపంలోని ఆక్స్‌ఫర్డ్ మోడల్ హైస్కూల్ (ప్రైవేటు)లో గురువారం ఉదయం 9 గంటల సమయంలో ప్రార్థన చేస్తుండగా 10 మంది విద్యార్థులు కళ్లు తిరిగి కిందపడి వాంతులు చేసుకున్నారు. గమనించిన ఉపాధ్యాయులు, యాజమాన్యం వెంటనే 108 అంబులెన్సుకు ఫోన్ చేశారు. కొద్ది క్షణాల్లోనే మరికొంత మంది విద్యార్థులు కడుపునొప్పితో వాంతులు చేసుకోవడంతో నాలుగు అంబులెన్సులు, ఇతర వాహనాల్లో 34 మంది విద్యార్థులను అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థులకు చికిత్స అందించగా కోలుకున్నారు. ఇందులో శివ అనే విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ప్రస్తుతం నిలకడగా ఉంది. అయితే స్కూల్‌కు సంబంధించిన హాస్టల్‌లో ఉదయం పెసరపప్పు, చపాతి తిన్నట్లు విద్యార్థులు చెప్పారు. కాగా కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు నాణ్యతగా లేవని, హాస్టల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థులు తిన్న అల్పాహార పదార్థాలను ల్యాబ్‌కు పంపించి ఫలితాలను తీసుకుంటామని డీఎంహెచ్ఓ రామకృష్ణ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

ప్రైవేటు స్కూల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశించారు. వాట్సాప్ వీడియో కాల్ ద్వారా ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్ మహేష్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు ఆస్పత్రిలో వసతులు కల్పిస్తూ వైద్యం అందించాలన్నారు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు స్కూల్ హాస్టల్‌ను పరిశీలించారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

ఉలిక్కిపడ్డ యంత్రాంగం..

ఈ మధ్యకాలంలో ప్రభుత్వ వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటుండగా.. అచ్చంపేటలోని ప్రైవేటు స్కూల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. విషయం తెలిసిన వెంటనే డీఈఓ గోవిందరాజులు, డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్ఓ తారాసింగ్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్‌ఐ రాములు, పోలీసు, వైద్య బృందం అచ్చంపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎవరికి ఎలాంటి అపాయం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు వైద్య సిబ్బందితో కలిసి ప్రైవేట్ హాస్టల్ పరిసరాలు, ఆహార పదార్థాలు, నిల్వ ఉన్న కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. డీఈఓ గోవిందరాజులు హాస్టల్‌కు వెళ్లి అక్కడి వంట మనుషులు, విద్యార్థులతో వివరాలు సేకరించారు.



విద్యార్థులతో విచారిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు

పాము కాటుతో వ్యక్తి మృతి

ఊర్కొండ: మండల పరిధిలోని రాచపల్లిలో పాము కాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాద్గుల నాగయ్య(55) తన వ్యవసాయ పొలంలో వరినాటు వేస్తున్న క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు.

ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వ్యక్తి మృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అశోక్‌బాబు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కిష్టారానికి చెందిన చెన్నయ్య(44) గురువారం తన టీవీఎస్ మోపెడ్ పై జడ్చర్లకు వస్తుండగా.. కావేరమ్మపేట సమీపంలో ఏఎస్‌ఆర్ గార్డెన్ ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి

పాలమూరు: న్యాయవాదుల రక్షణ చట్టం వచ్చేంత వరకు నిరంతరం పోరాటం చేస్తామని న్యాయవాదుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథ్‌గౌడ్ అన్నారు. జనగాం జిల్లాలో మంగళవారం జరిగిన ఘటనకు నిరసనగా గురువారం రెండోరోజు జిల్లా కేంద్రంలో జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. న్యాయవాదులంతా కలిసి కోర్టు ప్రాంగణం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌నాథ్‌గౌడ్ మాట్లాడుతూ జనగాం జిల్లాలో జరిగిన సంఘటన మాత్రమే కాదని ఇప్పటికే రాష్ట్రంలో చాలా సంఘటనల్లో న్యాయవాదులపై దాడులు జరిగాయన్నారు. న్యాయవాదుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న పోలీసుల తీరు బాధాకరమన్నారు. పోలీసులు, న్యాయవాదులు పరస్పరం ప్రజల కోసం పనిచేయాల్సి ఉండగా.. ప్రజల పక్షాన వెళ్లినటువంటి న్యాయవాదుల పట్ల దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడడం అత్యంత హేయమైన చర్య అన్నారు. న్యాయవాద దంపతులపై దాడికి పాల్పడిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం ఎంతో అవసరమన్నారు. సీనియర్ న్యాయవాది చంద్రమౌళి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, శివకుమార్, వినోద్, కృష్ణ, జాకీర్, హన్మంతు, ఎన్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో మానవహారం ఏర్పాటు చేసిన న్యాయవాదులు